క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు



కేఆర్‌ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మద్దిలపాలెం: విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీవో ఎంవీ రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆదేశాల మేరకు పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంరక్షణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి తెలిపారు. వెయ్యి రోజుల పోషణ సంరక్షణలో తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలకు వివరించారన్నారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

పోషకాహారంతో గుండె ఆరోగ్యం పదిలం

ఏయూక్యాంపస్: పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం పదిలం చేసుకోవచ్చునని డాక్టర్ రోహిణి పాటిల్ అన్నారు. బీచ్ రోడ్డులో బుధవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కార్డియో మెటబాలిక్ ఆరోగ్యానికి, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి బాదం దోహదపడతాయన్నారు. దయాస్టోలిక్ రక్తపోటును నియంత్రించడం, బరువు నిర్వహణ, నియంత్రణకు బాదం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఆహార పదార్థాల్లో బాదంను భాగం చేసుకోవాలని, జీర్ణక్రియ మెరుగు పరచడంలో ఇది ఎంతో చురుకైన భూమిక పోషిస్తుందని వివరించారు.

23న ఎస్.జానకి పాటల సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎంవీపీకాలనీ: ప్రముఖ గాయని ఎస్.జానకి జన్మదిన వేడుకలు ఈ నెల 23న మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా జరగనున్నాయి. యాక్మీ, చౌదరి క్రియేషన్స్, ఎంవీఆర్ ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ఎస్.జానకి పాడిన పాటలతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నట్లు యాక్మీ అధ్యక్షుడు ప్రతాప్ తెలిపారు. మిలీనియం శేఖర్ ఆర్కెస్ట్రా ద్వారా సింగర్లు మాళవిక, హితేష్ సాయి తదితరులు మధురగీతాలను ఆలపిస్తారన్నారు. ప్రముఖ ఫ్లూట్ మాస్ట్రో తాళ్లూరి నాగరాజు, మణి దంపతులను సత్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనున్నట్లు వెల్లడించారు.

కుటుంబ సభ్యుల చెంతకు జార్ఖండ్ వాసి



కుటుంబ సభ్యులతో నితీష్‌కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన వ్యక్తిని కుటుంబం చెంతకు చేర్చేలా షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మూడు నెలల కిందట కంచరపాలెం ఫుట్‌పాత్ మీద ఒక వ్యక్తి మానసిక పరిస్థితి బాగోక తిరుగుతూ ఉండటం గమనించిన కంచరపాలెం పోలీసులు జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ మమతకు సమాచారమిచ్చారు. ఆమె వెంటనే స్పందించి అతడికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. వివరాలు ఆరా తీయడంతో తన పేరు నితీష్‌కుమార్ అని, తనది జార్ఖండ్ దగ్గర ఇర్బా పహంతోళి గ్రామమని చెప్పాడు. దీంతో షెల్టర్ మేనేజర్ మమత నితీష్‌కుమార్‌ను అతడి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఎక్కడ వెతికినా దొరకని తన కొడుకు ఒక్కసారిగా కళ్ల ముందుకు వచ్చేసరికి ఆ తల్లి కన్నీటి పర్యంతమైంది. తమ బిడ్డను అప్పగించిన మమతకు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు విస్తరణకు కూటమి నేతలే అడ్డు

విస్తరణ జరిగితే కూటమి నేతల ఇళ్లు, షాపులు తొలగించాల్సి ఉంటుంది

ఎమ్మెల్యేను ఆశ్రయించిన నేతలు

ఆయన ఒత్తిడి తోనే పనులు నిలిపివేసిన అధికారులు



తోటగరువు, పెదగదిలి రోడ్లలో నిలిచిపోయిన డబుల్ రోడ్డు పనులు..

ఆరిలోవ:

తూర్పు నియోజక వర్గం పరిధిలోని ఆరిలోవలో రోడ్డు విస్తరణ పనులకు గ్రహణం పట్టింది. కొన్ని కోట్ల రూపాయల వ్యయంతో ప్రారంభమైన ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏడాది గడిచినా ఇంతవరకు పునఃప్రారంభం కాలేదు. పనులు జరిపించి ప్రజల అవసరాలు తీర్చాల్సిన జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2024 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు జీవీఎంసీ నిధులతో ఇక్కడ ప్రారంభమైన రోడ్డు అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిలిపివేసింది. ప్రజా అవసరాల కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కొందరు టీడీపీ నాయకులు, వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసం నిలిపివేయడం గమనార్హం. దీంతో ఆరిలోవ ప్రజలు కూటమి నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో శ్రీకారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆరిలోవలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో భాగంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కృషితో బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్, అంబేడ్కర్ కూడలి, పార్వతీనగర్ వరకు బ్రిడ్జితో పాటు సుమారు కిలోమీటరుకు పైగా డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.11.49 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు 2024 జనవరిలో ప్రారంభమయ్యాయి. ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల వరకు కొంతమేర పనులు పూర్తయ్యాయి. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మిగిలిన పనులకు బ్రేక్ పడింది. ప్రజలకు ఉపయోగపడే ఈ పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించినవి కావడంతో, స్థానిక టీడీపీ నాయకులు కొందరు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుపై ఒత్తిడి తెచ్చి మధ్యలోనే నిలిపివేయించారు. ఈ నిధులలో పెదగదిలి – తోటగరువు మధ్యలో రూ. 3.45 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికే సుమారు 90 శాతం పూర్తవడంతో అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో పూర్తి చేయాల్సి వచ్చింది. మిగిలిన రోడ్డు విస్తరణ పనులు మాత్రం మధ్యలోనే నిలిచిపోయాయి.

మధ్యలో నిలిచిపోయిన పనులు ఇవే..

రూ. 8 కోట్లతో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, కాలువలు, డివైడర్లు తదితర అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి (గెడ్డపై కొత్త బ్రిడ్జి నుంచి) నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరుకు పైగా కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టడానికి రూ. 3.76 కోట్లు కేటాయించారు. బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ మీడియా (డివైడర్), వీధి దీపాల ఏర్పాటు కోసం జీవీఎంసీ అధికారులు మరో రూ. 1.75 కోట్లు కేటాయించారు. వీటితో పాటు సూర్యతేజానగర్ బ్రిడ్జి నుంచి పార్వతినగర్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు బీటీ రోడ్డు, కాలువలు, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు, పార్వతీనగర్ వద్ద క్రాస్ కల్వర్టు విస్తరణ, సెంట్రల్ మీడియా (డివైడర్), సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం అధికారులు రూ. 2.53 కోట్లు కేటాయించారు. ఆయా పనులు కూడా 2024 సాధారణ ఎన్నికలకు ముందు ప్రారంభమయ్యాయి. పెదగదిలి నుంచి తోటగరువు మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన డివైడర్ పనులు మధ్యలో నిలిచిపోయాయి. పెదగదిలి నుంచి తోటగరువు వెటర్నరీ ఆస్పత్రి వరకు డివైడర్ నిర్మించి వదిలేశారు. మిగిలిన రోడ్డులో మధ్యలో తవ్వి కొన్నాళ్ల తర్వాత పనులు జరపకుండా గోతులు పూడ్చేశారు. అంబేడ్కర్ కూడలి నుంచి పార్వతీనగర్, సూర్యతేజానగర్ రోడ్డు పనులు ప్రారంభించలేదు.

కూటమి నేతల ప్రయోజనం కోసమే..

రోడ్డు విస్తరణ జరిగితే ఆరిలోవ ప్రాంతం రూపురేఖలు మారుతాయని స్థానికులు భావించారు. ట్రాఫిక్ సమస్యలు ఉండవని ఆశించారు. కానీ వారి ఆశలకు కొందరు స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకట్ట వేశారు. తోటగరువు నుంచి బాలాజీనగర్ వరకు, పార్వతీనగర్ ప్రాంతంలో కొందరు టీడీపీ, బీజేపీ నాయకులకు చెందిన ఇళ్ల భాగాలు, షాపులు రోడ్డు విస్తరణలో అధికారులు తొలగించాల్సి వస్తుంది. దీంతో ఎవరికోసమో రోడ్డు నిర్మాణం జరిగితే తమ ఇళ్ల భాగాలు, షాపులు కోల్పోతామని, అద్దెలు కోల్పోయి నష్టపోతామని ఆ నాయకులు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి వద్ద మొరపెట్టుకున్నారట. దీంతో ఎమ్మెల్యే వారికి మద్దతుగా నిలిచి జీవీఎంసీ అధికారులకు చెప్పి అక్కడ రోడ్డు పనులు ఆపేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో చేసేదేమీ లేక జీవీఎంసీ అధికారులు అప్పటివరకు జరుగుతున్న అభివృద్ధి పనులను ఆపేశారు. వాటి కోసం తవ్విన గోతులను కాంక్రీట్‌తో కప్పేశారు.



విస్తరణకు నోచుకోని తోటగరువు, బాలాజీనగర్ ప్రధాన రహదారి



విస్తరించాల్సిన పార్వతినగర్, సూర్యతేజ నగర్ రహదారి

వేల మంది ప్రజలకు ఇబ్బంది

ఆరిలోవ కాలనీ నుంచి బీఆర్‌టీఎస్ మీదుగా రోజూ వేల మంది ప్రజలు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ సిటీ బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వేల సంఖ్యలో రోజూ అంబేడ్కర్ కూడలి నుంచి ఒకవైపు సూర్యతేజానగర్ మీదుగా చినగదిలి కూడలికి, మరోవైపు బాలాజీనగర్, తోటగరువు మీదుగా పెదగదిలి కూడలికి చేరుతుంటాయి. రోజూ వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో ఆయా రహదారుల విస్తరణ, డబుల్ రోడ్ల నిర్మాణం అత్యవసరం. టీడీపీ నాయకుల స్వార్థం కోసం, వారికి లాభం చేకూర్చాలనే ఆలోచనతో స్థానిక ఎమ్మెల్యే వేల మంది ప్రజలకు ఉపయోగపడే రోడ్ల పనులు నిలిపివేయడం మంచి పద్ధతి కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నలుగురు కూటమి నాయకుల కోసం వేల మంది ప్రజలను పక్కనబెట్టారంటూ ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు



బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఆచార్యులు

విశాఖ విద్య: భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారంగా నడుస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మకంగా పనిచేస్తూ నూతన ఆవిష్కరణలు జరపాలని సూచించారు. యువత ఇక్కడ నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించేలా అడుగులు వేయాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. యువతను ప్రోత్సహించడం, వారి ఆలోచనల నుంచి అనేక సమాజ ఉపయుక్త పరిష్కారాలను తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని బతికించుకుందాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు



గోపాత్రుడు నాటికలోని ఓ సన్నివేశం

విశాఖ విద్య: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం ఏయూ ఓపెన్ థియేటర్‌లో తెలుగు నాటకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి వర్సిటీ ఆచార్యులతో కలసి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరేశలింగం జయంతిని నాటక రంగ దినోత్సవంగా ప్రకటించడం నాటక రంగానికి గుర్తింపు దక్కినట్లేనన్నారు. కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్రలో నాటక రంగానికి నేటికీ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. సమాజం ఉన్నంత వరకు నాటకం బతికే ఉంటుందని పేర్కొన్నారు. సమాజ ఇతివృత్తాలను కళ్లకు కట్టినట్లుగా చూపించే అవకాశం ఒక్క నాటక రంగలోనే ఉంటుందని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్ విభాగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన గోపాత్రుడు నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శశిభూషణ్‌రావు, ఆచార్య ప్రేమనందం, ఆచార్య విజయ్‌మోహన్, ఆచార్య పల్లవి, డైరెక్టర్ డా.కిరణ్‌కుమార్, డా.రాజేంద్రప్రసాద్, పితాని ప్రసాద్, డా.వీర్‌కుమార్, హేమ వెంకటేశ్వరి, దుర్గారావు, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై ఆర్టీసీలో డెమో

దాబాగార్డెన్స్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఆధ్వర్యంలో బుధవారం ఏపీఎస్ఆర్‌టీసీ ద్వారకా బస్టేషన్ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై డెమో నిర్వహించారు. అనుకోని విధంగా ప్రమాదం సంభవిస్తే ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయంపై ఆర్‌టీసీ సిబ్బంది, ప్రయాణికులకు ఉచిత డెమోను జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు తగు సూచనలు చేశారు. ముఖ్యంగా గృహిణులు ఇళ్లల్లో వాడే గ్యాస్ సిలిండర్లు, ఇతర అగ్ని రాజిల్లే పదార్థాల నుంచి మంటలు ఏ విధంగా నియంత్రించాలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇచ్చిన సూచనలు తప్పకుండా పాటించాలని, ఫలితంగా అగ్ని ప్రమాదాలు నివారించడంతో పాటు విలువైన ప్రాణాలు, వస్తువులు కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ సూపర్‌వైజర్లు, సిబ్బంది, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది, ఆర్టీసీ ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

నటులందరికీ మార్గదర్శకుడు చార్లీ చాప్లిన్



చార్లీ చాప్లిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రపంచ హాస్య నటుడు చార్లీ చాప్లిన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు తదితరులు చాప్లిన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ నటనలో తనదంటూ ప్రత్యేక శైలిని అలవర్చుకున్న చాప్లిన్ విశ్వ మానవుడని, నటులందరికీ మార్గదర్శకుడని కొనియాడారు. ప్రపంచ సినీ రంగంలో సృజనాత్మకతతో మూకీల యుగంలో సాంకేతిక ఇబ్బందులను అధిగమించాడన్నారు. విషాదంతో కూడిన తన నటనతో ప్రేక్షకులకు హాస్యాన్ని పంచిన చార్లీ చాప్లిన్ మరణం లేని కళాకారుడని కొనియాడారు. అనంతరం చాప్లిన్ దర్శకత్వంలో 1936లో విడుదలై సంచలనం సృష్టించిన మోడరన్ టైమ్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి హుస్సేన్, జాయింట్ సెక్రటరీ చాట్ల బాబూరావు, కార్యవర్గ సభ్యులు బాబ్జి, రాంప్రభు, కుమారి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ



ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తున్న బోర్డ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

ఆరిలోవ: బీవీకే విద్యా సంస్థలో ఒకేషనల్ కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థల బోర్డ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కళాశాల ఒకేషనల్ కోర్సుల ఫస్టియర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కళాశాలను సందర్శించి ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. ఇక్కడ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రస్తుతం ఒకేషనల్ కోర్సులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఇక్కడ ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట రమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

20న సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

దాబాగార్డెన్స్: ఈ నెల 20న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ తెలిపారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సమావేశాలకు సిటూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావుతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు చెప్పారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయని, దీని విజయవంతం, మేడే ఉత్సవాల నిర్వహణపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై చర్చలు, భవిష్యత్ పోరాటాలపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సిఫార్సు

మహారాణిపేట: కేజీహెచ్‌లోని జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ఆవరణలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులకు సిఫార్సు చేయనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన నూతన జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో సీతారాం మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ, తప్పొప్పుల సవరణ చేసి 24 గంటల్లోగా పత్రాలు అందజేయగలగడం ఉత్తరాంధ్ర బాలల విజయమన్నారు. పుట్టిన బిడ్డ తల్లిదండ్రుల పేర్లు, వివాహం తర్వాత తల్లి ఇంటి పేరు తండ్రి ఇంటి పేరుగా మార్పు వంటివి నూటికి నూరు శాతం తప్పులు లేకుండా అందించడంపై ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తన దృష్టికి తెచ్చారన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఆధార్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు జరిగేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.రవి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి.రమణ, సి.ఎస్.ఆర్.ఎం.వొ.జి.మెహర్‌కుమార్, చిన్న పిల్లల వార్డు విభాగాధిపతి బి.ఎస్.చక్రవర్తి, ప్రసూతి విభాగం వైద్యులు డాక్టర్ కె.శ్యామల, డాక్టర్ సువిధ, స్టాటిస్టికల్ అధికారి దయానిధి రావు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జియో సింథటిక్స్‌తో బహుళ ప్రయోజనాలు



సదస్సు ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్

విశాఖ విద్య: జియో సింథటిక్స్ బహుళ ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఒకరోజు సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ మేధస్సు నుంచి జియో సింథటిక్స్ ఉద్భవించిందని, మూడు శతాబ్దాలుగా దీని ప్రాముఖ్యత పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖలో చేపట్టిన తొలి ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా జియో సింథటిక్స్ వినియోగించామని చెప్పారు. యువ ఇంజినీర్లు ఈ రంగాన్ని తమ కెరీర్‌గా మలచుకోవడానికి సదస్సు ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. నిపుణులు సుస్థిర పరిష్కారాలను అందించాలని సూచించారు. మెకాఫెరి సంస్థ బిజినెస్ హెడ్ గిన్లుకా స్పాడారో, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యుడు సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం రన్‌వే పటిష్టతకు, ఇతర ప్రాంతాల్లో బహుళ నిర్మాణాలు చేపట్టడానికి జియో సింథటిక్ మెటీరియల్స్‌ను వినియోగించామని తెలిపారు. అనంతరం పోర్టుల నిర్మాణం, నేల కోత నివారణ, జాతీయ రహదారులపై డ్రైనేజీల నిర్మాణం, జియో సింథటిక్స్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం, వివిధ ప్రాంతాల్లో జియో సింథటిక్స్ నిర్మాణాలు–వాటి ప్రాముఖ్యతలు, రైల్వే లైన్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేల నిర్మాణంలో జియో సింథటిక్ వినియోగం, ఉపయోగాలు తదితర అంశాలపై నిపుణులు ప్రసంగించారు. సదస్సులో పరిశ్రమల నిపుణులు, సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యులు వివిధ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి మేలు చేకూరేలా పరిశోధనలు



కుమారికి డాక్టరేట్ అందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: విద్యా రంగానికి మేలు చేకూర్చేలా పరిశోధనలు సాగాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ కళాశాల విద్యా విభాగ పరిశోధక విద్యార్థిని ఇసుకపాటి దెబోర కుమారికి ఏయూ డాక్టరేట్ లభించింది. బుధవారం వీసీ చేతుల మీదుగా ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఇంగ్లిష్ యాజ్ ఏ మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్ ఇన్ అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఇన్ ది డిస్ట్రిక్ట్ ఆఫ్ విశాఖపట్నం- ఎ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ లభించింది. ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నాగరాజకుమారి పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా దెబోర కుమారిని విద్యా విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

గణపతికి సంకటహర చతుర్థి పూజలు



విజయ గణపతి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



లలితా పీఠంలో అభిషేకానంతరం గణపతి

ఏయూక్యాంపస్: గణపతి ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. గణపయ్యకు పంచామృతాభిషేకాలు, దూర్వయుగ్మం(గరిక)తో ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక లలితా పీఠంలోని వరసిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకం, అభీష్ట సిద్ధి బీజాక్షర పూజలు చేశారు. కిర్లంపూడిలోని విజయ గణపతి ఆలయంలో హోమం చేశారు. గణపతికి ఉండ్రాళ్ల నివేదించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.